# యూట్యూబర్ అన్వేష్‌పై కేసు

## బెట్టింగ్ యాప్స్‌పై డిజిపి, మాజీ సిఎస్‌పై తప్పుడు ఆరోపణలు

## కేసు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు



మన తెలంగాణ/సిటీబ్యూరో: ప్రపంచ యాత్రికుడు, యూట్యూబర్ అన్వేష్‌పై సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంలోని ఉన్నతాధికారులపై అన్వేష్ తప్పుడు ఆరోపణలు చేశాడని, నిరాధారమైన సమాచారంతో వీడియోను ప్రచారం చేశాడని కానిస్టేబుల్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. తెలంగాణ డిజిపి జితేందర్, మెట్రో ఎండి ఎన్‌విఎస్ రెడ్డి, మాజీ సిఎస్ శాంతికుమారితోపాటు పలువురు సీనియర్ ఐఎఎస్ అధికారులు మెట్రోలో బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేశారని ఆరోపించారు. ప్రమోషన్ కోసం వీరు రూ.300కోట్లు వసూలు చేశారని ఆరోపించారు. ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమని పోలీసులు తెల్పారు. ఇటీవల బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లు చేస్తున్న వారిపై అన్వేష్ వీడియోలు చేస్తున్నాడు. ఈ క్రమంలోనే హైదరాబాద్ మెట్రో రైలులో బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లపై కూడా అన్వేష్ వీడియో చేశారు. ఇది వివాదానికి దారితీసింది, ఆధారాలు లేకుండా వీడియో తీసి ప్రచారం చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అన్వేష్ వీడియో ప్రజల్లో గందరగోళం సృష్టించేలా, అధికారుల ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు.